క్లుప్తంగా

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

మణుగూరురూరల్: త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉన్నందున.. ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు బుధవారం ఓ ప్రకటనలో కార్యకర్తలకు, నాయకులకు పిలుపు నిచ్చారు. పినపాక నియోజకవర్గంలోని మండలాల అధ్యక్షుడు స్థానిక నాయకులతో కలిసి గ్రామాల్లో పర్యటించి గతంలో బీఆర్ఎస్ అమలు చేసి సంక్షేమ పథకాలను.. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను, వైఫల్యాలను వివరించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. నేడు గురువారం నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

అశ్వాపురం: మండల పరిధిలోని తుమ్మలచెరువు గ్రామ పంచాయతీలో అల్లూరి సీతారామరాజు 2వ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు బుధవారం ముగిశాయి. ముగింపు వేడుకల్లో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. టోర్నమెంట్ లో విజేతగా తుమ్మలచెరువు, రన్నరప్‌గా రామవరం, మూడో స్థానంలో వెంకటాపురం జట్లు నిలవగా రేగా కాంతారావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు తాటి పూజిత, బొర్రా శ్రీను, మాజీ సర్పంచ్ మడకం సాధు, కోరెం రామారావు, కోండ్రు రాజు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, సూదిరెడ్డి గోపాలకృష్ణారెడ్డి, టోర్నమెంట్ నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పోరాట ఫలితంగానే పట్టాలు



పట్టాలు అందుకున్న గిరిజనులతో సీపీఎం నాయకులు

భద్రాచలంఅర్బన్: రాష్ట్రంలో సీపీఎం చేసిన పోరాట ఫలితంగానే సాగులో ఉన్న గిరిజనుల పోడు భూములకు పట్టాలు దక్కాయని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అన్నవరపు కనకయ్య పేర్కొన్నారు. బుధవారం స్థానిక భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో అర్హులైన 400 మంది పోడు సాగుదారులకు ప్రాజెక్టు ఆఫీసర్ బి.రాహుల్ పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అన్నవరపు కనకయ్య మాట్లాడారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడుభూములకు పట్టాలిప్పించేందుకు తమ పార్టీ పెద్ద ఎత్తున పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, సురేష్, సీతారం, మల్సూర్, హనుమంతు, శకర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మాట తప్పిన ప్రభుత్వం

అశ్వారావుపేట: ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట తప్పిందని సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ రాష్ట్ర నాయకుడు కెచ్చెల రాంగారెడ్డి ఆరోపించారు. స్థానిక మాస్‌లైన్ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. చెప్పినట్లుగా రైతు భరోసా రూ.15 వేలు ఇవ్వాలని, వ్యవసాయం గిట్టక వలసపోతున్న వారిని ఏడాది పొడవునా కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువులు చౌక ధరలకు అందించాలని అన్నారు. ప్రభుత్వ, ఫారెస్టు భూముల్లో గుడిసెలు నిర్మించుకున్న పేదవారందరికీ పట్టాలివ్వాలని, అటవీ శాఖాధికారుల దాడులు ఆపాలని సూచించారు. సమావేశంలో మాస్‌లైన్ పాల్వంచ డివిజన్ నాయకులు గోకినపల్లి ప్రభాకర్, కావడిగుండ్ల మాజీ సర్పంచ్ కంగాల భూలక్ష్మి పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

చర్ల: తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు కోసం తన గళం, గాత్రంతో అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు గద్దర్‌పై తప్పుడు వ్యాఖ్యలు చేసిన భారత హోం వ్యవహారాల సహాయ మంత్రి బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ చర్ల మండల అధ్యక్షుడు కొండా కౌశిక్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని బీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిష్పక్షపాతంగా ఇవ్వాల్సిన అవార్డులు బండి సంజయ్ వ్యాఖ్యల వల్ల మోదీ ప్రభుత్వాన్ని దిగజార్చినట్లయిందని అన్నారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలివేరులో పూజలు

చర్ల: మండలంలోని కలివేరులో ఉన్న ముత్యాలమ్మ వారి దేవాలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించనున్న పోతురాజు స్వామి, నాగేంద్ర స్వాముల రాతిశిల విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవంలో భాగంగా బుధవారం గణపతిపూజ, పుణ్యాహవచనం, అంకురారోపణ, అగ్నిప్రతిష్ఠ తదితర కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితులు రాఘవశర్మ నేతృత్వంలో భీష్మాచార్యులు, వినోదాచార్యులు కార్యక్రమాలను కొనసాగించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 31న పోతురాజు స్వామి, నాగేంద్రస్వామి వార్ల రాతి శిల విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు.

ఆ ట్రాక్టర్ ఏమైంది..?



తహసీల్ ఆవరణలోని అక్రమ ఇసుక వాహనం మాయం

- పది రోజులవుతున్నా కానరాని ఆచూకీ..

ములకలపల్లి: సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్ మాయం కావడం.. ఘటన జరిగి పది రోజులు దాటినా పురోగతి కానరాకపోవడం ఒకింత విస్మయానికి గురిచేస్తోంది. ఠాణాలో ఫిర్యాదు చేశామని రెవెన్యూ అధికారులు చెపుతున్నా, అతీగతి లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. కాగా తమకేమీ ఫిర్యాదు అందలేదని పోలీసులు చెపుతుండడం కొసమెరుపు.

పది రోజులు అవుతున్నా..

ట్రాక్టర్ మాయమై పది రోజులవుతున్నా ఈవిషయంలో ఎటువంటి పురోగతిలేదు. ట్రాక్టర్ అపహరణకు గురైందా? లేక మాయం చేశారా అనేది బయటికి రావడంలేదు. కాగా స్థానిక రెవెన్యూ సిబ్బంది సహకారంతోనే ఇసుక వాహనం బయటికి తరలించారనే పుకార్లు షికార్లు చేస్తున్నాయి. సాక్షాత్తూ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ (తహసీల్దార్) ఆఫీస్ నుంచి ట్రాక్టర్ బయటికి వెళ్లిందటే ఇంటి దొంగల సహకారం లేకుండా సాధ్యపడదనే వాదనలు వినిపిస్తున్నాయి. సుమారు పది రోజులు అవుతున్నా, రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం అనుమానాలు బలోపేతం చేస్తోంది. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని చేతులు దులుపుకుంటున్న రెవెన్యూ అధికారులు, ఫిర్యాదు కాపీ నకలు ఇవ్వాలని తహసీల్దార్ పుల్లారావుకు కోరగా, మరుసటి రోజు ఇస్తామని తాత్సారం చేయడం గమనార్హం.

అసలేం జరిగిందంటే..

ములకలపల్లి మండలంలోని మూకమామిడి శివారులోని వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు ఈనెల 17న రెవెన్యూ అధికారులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈమేరకు గిర్దావార్–2 భద్రు దాడి నిర్వహించి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తోలుతున్న ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. తహసీల్ కార్యాలయానికి తరలించి, ఆవరణలో ఉంచారు. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ.. కార్యాలయ ఆవరణలో ఉంచిన ట్రాక్టర్ మాయమైనట్లు 20వ తేదీన (సోమవారం) అధికారులు గుర్తించారు. విషయం బయటికి పొక్కడంతో 21వ తేదీన (మంగళవారం) తహసీల్దార్ పుల్లారావును వివరణ కోరగా, ట్రాక్టర్ మాయమైన విషయం నిజమేనని తెలిపారు. పోలీస్‌స్టేషన్లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. ఈతరుణంలో 22 (బుధవారం)న ట్రాక్టర్ మాయమైనట్లు పత్రికల్లో వార్తలు వెలువడ్డాయి.

గుండాలలో ఎమ్మెల్యే పర్యటన



చిన్నవెంకటాపురం బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

గుండాల: గుండాల మండలంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బుధవారం పర్యటించారు. చిన్న వెంకటాపురం–మల్లెల గుంపు మధ్య కిన్నెరసాని వాగుపై బ్రిడ్జి పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం సాయనపల్లి, గుండాల, జగ్గాయిగూడెం గ్రామాల్లో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఇప్పటివరకు అంతర్గత రోడ్లకు రూ. 1.30 లక్షలు మంజూరవగా.. పనులను ప్రారంభించినట్లు తెలిపారు. ఇంకా మండలంలో ఏయే గ్రామాల్లో అంతర్గత రోడ్లు అవసరమో పంచాయతీ రాజ్ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని, వాటికి నిధులు వచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. త్వరలోనే రంగాపురం–గుండాల, బట్టుపల్లి–మామకన్ను, పెద్దతోగు–ముత్తాపురం, పెద్దవెంకటాపురం–ఆళ్లపల్లి, అడవిరామారం– బోడాయికుంట, ముత్తాపురం –దొంగతోగు గ్రామాల మధ్య రోడ్డు పనులు ప్రారంభించేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇమ్మానుయేల్, ఎంపీడీఓ సత్యనారాయణ, ఎఓ వెంకటరమణ, సీఐ రవీందర్, ఎస్సై రాజమౌళి, కాంగ్రెస్ నాయకులు ఎస్‌కె.ఖదీర్, దారా అశోక్, కొడెం ముత్యామాచారి, పాంబోయిన ముత్తయ్య, ఈసం పాపారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కాచనపల్లి గ్రామంలో ఇటీవల మరణించిన పోలెబోయిన లక్ష్మి దశదిన కర్మలకు పినపాక ఎమ్మెల్యేతో పాటు, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యలు పాల్గొని కుటుంబాన్ని పరామర్శించారు. ఆళ్లపల్లి మండలంలో రాయిపాడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పెండెకట్ల నాగేశ్వరావు ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకుని ఆ కుటుంబాన్ని పరామర్శించారు.

నేటి నుంచి కుష్టు వ్యాధిపై అవగాహన



ఏఎన్ఎంలు, ఆశవర్కర్ల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ తనుజా

చంద్రుగొండ: కుష్టువ్యాధిపై ఈ నెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 13 వరకు గ్రామాల వారిగా సర్వే నిర్వహించనున్నట్లు డాక్టర్ తనుజా తెలిపారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఏఎన్ఎంలు, ఆశవర్కర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంటింటికి తిరిగి కుష్టువ్యాధిపై అవగాహన కల్పించాలన్నారు. ఏడాది పిల్లల నుండి 19 ఏళ్ల లోపు వారికి నులిపురుగుల నివారణ కోసం ఆల్‌బెండాజోల్ ట్యాబ్లెట్లు ఫిబ్రవరి 10న పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

పాఠశాలలో నిర్మాణాల ప్రారంభం



పాఠశాల అభివృద్ధి నివేదికలను అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

బూర్గంపాడు: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నవ లిమిటెడ్ సీఎస్ఆర్ ఫండ్స్‌తో నిర్మించిన వాష్ రూమ్స్, ప్రహరీ గోడలను బుధవారం తహసీల్దార్ ముజాహిద్‌తో కలసి నవ లిమిటెడ్ పరిశ్రమ జనరల్ మేనేజర్ ఎంజీఎం ప్రసాద్ ప్రారంభించారు. హెచ్ఎమ్ పద్మ మాట్లాడుతూ.. వాష్ రూమ్స్, ప్రహరీలు, గదులకు ఫ్యాన్లు, లైట్లను ఏర్పాటు చేసిన నవ లిమిటెడ్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ అసిస్టెంట్ మేనేజర్లు శంకర్, ఖాదరేంద్రబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

చర్ల: ఫిబ్రవరి, 4, 5 తేదీల్లో భద్రాచలం పట్టణంలో జరిగే పీడీఎస్‌యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌కు సంబంధించి బుధవారం వాల్‌పోస్టర్లను చర్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆవిష్కరించారు. సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కాంపాటి పృథ్వీ, డివిజన్ కార్యదర్శి మునిగెల శివప్రసాద్ మాట్లాడారు. నాయకులు జగదీష్, మహేష్, తరుణ్, అలేఖ్య, వర్షిని పాల్గొన్నారు.

అడవుల్లో జాగ్రత్తగా ఉండాలి



పులి పాదముద్రల కోసం అన్వేషిస్తున్న ఎఫ్‌డీఓ

పినపాక: అడవుల్లోకి వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్‌డీఓ సయ్యద్ మల్సూర్ మండల ప్రజలకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని పోట్లపల్లి అటవీ ప్రాంతంలో ఆయన పర్యటించారు. పులి సంచరిస్తుందన్న నేపథ్యంలో అడవిలో ప్రత్యేక కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. పులి పాదముద్రలు గుర్తించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసామన్నారు. రేంజర్ ఉపేందర్ పాల్గొన్నారు.

పాఠశాలలో వార్షికోత్సవ క్రీడలు



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వరరావు

పినపాక: మండలంలోని రాధిక కాన్సెప్ట్ పాఠశాలలో ఘనంగా వార్షికోత్సవ క్రీడలను ఏడూళ్ల బయ్యారం సీఐ వి.వెంకటేశ్వరరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచి క్రీడలపై మక్కువ చూపించి రాణించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు, సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని ఆ బాధ్యతను తల్లిదండ్రులు చూసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులను, గురువులను గౌరవించి వారు చెప్పిన విధంగా నడుచుకోవాలని అలాంటి వారే భవిష్యత్తులో మంచి స్థానంలో నిలుస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం గంగిరెడ్డి మధుసూదన్ రెడ్డి, సిహెచ్ జయ సింహారెడ్డి, సంపత్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ నిరోషా తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 3న సామూహిక అక్షరాభ్యాసం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణ కూనవరం రోడ్డులోని సరస్వతి శిశు ఆవాస విద్యాలయంలో ఫిబ్రవరి 3న మాఘ శుద్ధ పంచమిని పురస్కరించుకుని సరస్వతీ మాత మందిరంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యా కమిటీ అధ్యక్షుడు పాకాల దుర్గాప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొనే వారు చిన్నారులకు పసుపు, కుంకుమ, పలక, బలపం, కొబ్బరికాయ, పూలు, పండ్లుతో పాటు రెండు కిలోల బియ్యం తీసుకురావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొనే వారికి బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మ వారి ఆలయంలో అర్చన చేయించిన కుంకుమ, అమ్మవారి జ్ఞాపికను అందజేయనున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ జిల్లా ప్రచార కార్యదర్శిగా సూరి

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు పూజారి సూర్యచంద్రరావు (సూరి)ని జిల్లా ఆర్గనైజర్ కార్యదర్శిగా నియమిస్తూ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య ఉత్తర్వులను అందజేశారు. పార్టీ ఎదుగుదలకు కృషి చేస్తానని సూర్యచంద్రరావు ఈ సందర్భంగా తెలిపారు. పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరమాచినేని వినీల్, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ చింత్రాల రవికుమార్, నర్సాపురం మాజీ సర్పంచ్ వర్షా శివరామకృష్ణ తదిరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ ఆలయం వద్ద అన్నసమారాధన

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారం వారిగూడెం కాలనీ గ్రామంలో కొలువై ఉన్న పోలేరమ్మ తల్లి ఆలయం వద్ద బుధవారం భక్తులకు అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. అమావాస్య సందర్భంగా అమ్మ వారికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ఏపీలోని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం గ్రామానికి చెందిన సింగర్తి శ్రీను–వరలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించగా, భక్తులు హాజరయ్యారు.

నేడు గాంధీ విగ్రహాలకు నివాళి

అశ్వారావుపేట: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 420 రోజులు పూర్తయినప్పటికీ ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడాన్ని నిరసిస్తూ.. నేడు గాంధీ విగ్రహానికి నివాళి అర్పించనున్నట్లు మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సీపీఎం నాయకుడికి నివాళి

భద్రాచలంఅర్బన్: సీపీఎం సీనియర్ సభ్యుడు, పండ్ల వర్తక సంఘం (సీఐటీయూ) భద్రాచలం పట్టణ వ్యవస్థాపకుడు జి.గోపాలకృష్ణ మృతి పార్టీకి, కార్మికులకు తీరని లోటని సీపీఎం సీనియర్ నాయకుడు శంకర్‌రావు, పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామిలు అన్నారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ.. మృతి చెందిన గోపాలకృష్ణ భౌతిక కాయానికి బుధవారం పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా జరిగిన సంతాప సభలో వారు మాట్లాడారు. సీఐటీయూ నాయకులు, సీపీఎం నాయకులు, పండ్ల వర్తక సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సెక్రటేరియట్‌లో దరఖాస్తుల సమర్పణ



వినతిపత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేట: అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ నియోజకవర్గంలోని 95 సీఎంఆర్ఎఫ్ దరఖాస్తులను బుధవారం సెక్రటేరియట్‌లో సమర్పించారు. అనంతరం అరణ్యభవన్‌కు వెళ్లి అశ్వారావుపేట మున్సిపాలిటీకి అటవీశాఖ ద్వారా సెంట్రల్ ఫారెస్ట్ ఎకో పార్క్‌ను మంజూరు చేసి నిధులు కేటాయించాల్సిందిగా పీసీసీఎఫ్ ఎందోత్రియల్‌కు వినతిపత్రం సమర్పించారు. నిమ్స్ ఆస్పత్రిని సందర్శించి అక్కడ చికిత్స పొందుతున్న చంద్రుగొండ మండలం దామరచర్ల గ్రామానికి చెందిన యాలమూడి శ్రీనివాసరావు వైద్య నిమిత్తం రూ.1.3లక్షల ఎల్‌ఓసీ చెక్కును అందజేశారు. అదే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వినాయకపురం గ్రామానికి చెందిన ఉప్పల చిట్టిబాబు, దమ్మపేట మండలం మొండివర్రె గ్రామానికి చెందిన తగరం వెంకటేశ్వరరావులను పరామర్శించారు.

పాఠశాలల్లో ‘బాలమేళా’ నిర్వహించాలి

అశ్వారావుపేటరూరల్: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక స్థాయి విద్యార్థుల కోసం రూపొందించిన ఎఫ్ఎల్ఎన్ బాలమేళా–2025 కార్యక్రమాన్ని పాఠశాలల్లో నిర్వహించాలని అశ్వారావుపేట కాంపెక్స్ హెచ్ఎం పి.హరిత అన్నారు. బుధవారం స్థానిక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. వచ్చే నెల 4వ తేదీ నుంచి 11వ తేదీ వరకు కాంప్లెక్స్ పరిధిలోని అన్ని ప్రాథమిక పాఠశాలల్లో ఈ బాలమేళా కార్యక్రమాన్ని నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తరగతి గదిలోపల, వెలుపల విద్యార్థులు నేర్చుకున్న, సాధించిన ప్రతి అంశాన్ని ప్రదర్శించేలా కృషి చేయాలన్నారు. ఆర్‌పీ సత్యనారాయణ, సీఆర్‌పీ ప్రభాకరాచార్యులు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలపై అవగాహన



మణుగూరురూరల్: సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి



అశ్వారావుపేట: మాట్లాడుతున్న టీజీ నేబ్ డీఎస్పీ మధుమోహన్ రెడ్డి

మణుగూరురూరల్: ప్రతీ వాహనదారుడు నిర్లక్ష్యాన్ని వీడి రోడ్డు ప్రమాదాలను నివారించాలని మణుగూరు డీఎస్పీ వంగ రవీందర్‌రెడ్డి సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం మండల పరిధిలోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ మణుగూరు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో డీఎస్పీ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ద్విచక్రవాహనదారులు హెల్మెట్, కారు నడిపే వారు సీట్ బెల్ట్ తప్పక ధరించాలని, వాహనాలకు సంబంధించి అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండాలని సూచించారు. సదస్సులో బీటీపీఎస్ సీఈ బి.బిచ్చన్న, మణుగూరు సీఐ సతీష్‌కుమార్, ప్లాంట్ ఎస్ఈలు, డీఈలు, ఏఈలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలపై..

అశ్వారావుపేట: మాదకద్రవ్యాల వినియోగం, పర్యవసానాలు, అనర్థాలపై స్థానిక వ్యవసాయ కళాశాల విద్యార్థులకు బుధవారం టీజీ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో టీజీ నేబ్ ఖమ్మం డీఎస్పీ మధుమోహన్‌రెడ్డి మాదకద్రవ్యాల సేవించడం ద్వారా యువతపై పడే చెడు ప్రభావాలను వివరించారు. గంజాయి సేవించే వారిని మాన్పించే విధానం, రవాణా నిరోధం, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్, టీజీ నేబ్ సీఐ విజయ్‌రాం, అశ్వారావుపేట సీఐ టి.కరుణాకర్, ఎస్ఐ యయాతి రాజు పాల్గొన్నారు.

కాలినడకన వెళ్లి వితరణ



వలస ఆదివాసీలకు వితరణ అందించిన డాక్టర్ సుధారాణి

అశ్వారావుపేటరూరల్: దట్టమైన అటవీ ప్రాంతంలో, ఎత్తైన కొండపై నివాసం ఉంటున్న వలస ఆదివాసీ కుటుంబాలకు సుధా హెర్బల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం వితరణ అందించారు. మండలంలోని మొద్దులమడ పంచాయతీ పరిధిలో అటవీ ప్రాంతం ఉన్న పెద్దమిద్దె గ్రామానికి ఆ సంస్థ ఫౌండర్ డాక్టర్ కొనకళ్ల సుధారాణి బృందం అంతా కలిసి రోడ్డు మార్గం లేకపోవడంతో కాలినడక గ్రామానికి చేరుకున్నారు. అక్కడ ఉంటున్న 20 వలస ఆదివాసీ కుటుంబాలకు అవసరమైన నిత్యావసరాలు, పండ్లు వితరణ అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. అదే విధంగా వలస ఆదివాసీలతో మాట్లాడి, వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. వలస ఆదివాసీలు పోషకాహార లోపంతో బాధ పడుతున్నట్లు గుర్తించి ఆరోగ్య సూచనలు చేశారు.

ప్రభుత్వాస్పత్రిలో అధికారుల పరిశీలన



ప్రభుత్వ ఆస్పత్రి పరిసరాలను పరిశీలిస్తున్న తహసీల్దార్

పినపాక: రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గురువారం ప్రభుత్వాస్పత్రిని ప్రారంభిస్తారని తెలిపిన నేపథ్యంలో అధికారులు ఆస్పత్రిని పరిశీలించారు. ప్రారంభానికి కావాల్సిన ఏర్పాట్లు పూర్తి చేశారు. మంత్రి పర్యటన నేపథ్యంలో ఎటువంటి పొరపాట్లు జరక్కుండా జాగ్రత్త వహించాలని అన్ని శాఖల అధికారులను తహసీల్దార్ నరేష్ ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీల కోసం కొట్లాడుకోవద్దు

చంద్రుగొండ: రాజకీయ పార్టీల కోసం ఆదివాసీలు పరస్పరం కొట్లాడుకోవడం విచారకరమని, ఈ పద్ధతి మార్చుకోవాలని ఆదివాసీ సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ వాసం రామకృష్ణదొర అన్నారు. మండలంలోని బెండాలపాడు గ్రామంలో ఇటీవల జరిగిన ఘర్షణలో గాయపడిన పొడియం రవిని బుధవారం ఆయన పరామర్శించారు. ఆదివాసీల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని దాడులకు ప్రోత్సహించే వారిని క్షమించబోమన్నారు. దాడికి పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రవి కుటుంబ ఆర్థిక పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సంఘం రాష్ట్ర కార్యదర్శి చింత కృష్ణ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



దమ్మపేటలో ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధిహామీ ఉద్యోగులు

దమ్మపేట: పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ.. ఎంపీడీఓ రవీంద్రరెడ్డికి, ఉపాధి హామీ ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓను, ఉపాధిహామీ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసరాలు, రోజువారి ఖర్చులకు చేతిలో డబ్బులు లేక అప్పులు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, త్వరలోనే పరిష్కరించేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఉద్యోగులు వేముల సుధాకర్, పట్నాయక్, రాఘవ, రవి పాల్గొన్నారు.

ఉచితంగా పాస్‌బుక్‌ల పంపిణీ

అశ్వాపురం: సీపీఎం సీనియర్ నాయకుడు స్వర్గం బాలనర్సయ్య పేదలకు సుఖన్య సమృద్ధి యోజన పథకం పాస్‌బుక్‌లను అందజేసినట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు తెలిపారు. స్వర్గం బాలనర్సయ్య, భారజల కర్మాగారం రిటైర్డ్ ఉద్యోగి నాగభూషణం కలిసి మల్లెలమడుగు, చుట్టూ ప్రక్కల గ్రామాల నిరుపేద పిల్లలు 20 మందికి ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున జమచేసి సుఖన్య సమృద్ధి యోజన పథకం ఖాతా తెరిచారు. వాటి తాలూకు పాస్‌బుక్‌లను బుధవారం మొండికుంట గ్రామంలో పోస్టాఫీస్ వద్ద లబ్ధిదారులకు సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు చేతులు మీదుగా పంపిణీ చేశారు.

కార్యక్రమంలో సీపీఎం నాయకులు పినికేసి సుధాకర్‌రెడ్డి, పగడాల అశోక్‌రెడ్డి, తూము వెంకన్న, బద్దం శంభిరెడ్డి, మంగి వెంకటరమణ, ఆవుల సుధాకర్, బొమ్మరాతి రామయ్య, బూర్గంపాడు మండల నాయకులు వెంకటేశ్వర్లు, అశ్వాపురం బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ ప్రేమకుమారి, అసిస్టెంట్ పోస్ట్ మాస్టర్ పూజిత పాల్గొన్నారు.